క్లుప్తంగా

4న రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠ


రాధాకృష్ణుల ఆలయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు సౌత్‌జైల్‌రోడ్డు, ఎస్‌బీఐ కూడలి గొల్లలపాలెంలో ఈ నెల 4వ తేదీన రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఈ నెల 2న స్వామి ఊరేగింపు, జలాధివాస కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే 3న క్షీరాధివాసం, ధాన్యాధివాసం నిర్వహించి, 4 ఉదయం 8.22 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరపనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన చేపట్టనున్నారు. పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కానిస్టేబుల్ సంతోష్‌కు సత్కారం


కానిస్టేబుల్ సంతోష్‌ను సత్కరిస్తున్న జేసీఐ వాల్తేరు ప్రతినిధులు

అల్లిపురం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్‌కుమార్‌ను వాల్తేర్ జేసీఐ ప్రతినిధులు 'సెల్యూట్' పేరుతో సత్కరించారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ రేవతి, స్టేషన్ సిబ్బంది సమక్షంలో జేసీఐ వాల్తేరు అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి గౌతమ్, ఉపాధ్యక్షుడు కొండలరావు, పూర్వ మండలాధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు అనుదీప్ సంతోష్ కుమార్‌ను సాలువతో సత్కరించి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో పరిపూర్ణంగా, నిస్వార్థంగా సేవలందించిన ఉద్యోగులను సత్కరించి పోత్సహించడం తమ విధి అని తెలిపారు.

బాలుర గృహం సందర్శన


బాలురు తయారు చేసిన క్లాత్ బ్యాగులను పరిశీలిస్తున్న బులికృష్ణ

ఆరిలోవ: ముడసర్లోవ దరి దీన్‌దయాళ్‌పురం లోని ప్రభుత్వ బాలుర గృహాన్ని మంగళవారం అంతర్జాతీయ వీధి బాలుర దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందర్శించారు. ఇక్కడ తరగతి గదులు, భోజన శాలను తనిఖీ చేశారు. క్లాత్ బ్యాగుల తయారీ, నటనలో శిక్షణ తరగతులను పరిశీలించారు. క్లాత్ బ్యాగులు తయారు చేసిన బాలురను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


డ్రైవర్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న డిప్యూటీ చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్ తదితర సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన వారోత్సవాల్లో ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు డిప్యూటీ చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు. మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ, అసిస్టెంట్ మేనేజర్ బిందు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలి

బీచ్‌రోడ్డు పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు


బీచ్‌రోడ్డు సుందరీకరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్ : విశాఖలో మార్చిలో జరగనున్న జి–20 సదస్సుకు చేపడుతున్న నగర సుందరీకరణ పనుల్లో భాగంగా బీచ్ తీర ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డులోని పలు చోట్ల సుందరంగా తీర్చిదిద్దవచ్చని పర్యావరణ నిపుణులు సూచించిన మేరకు మంగళవారం ఆయన ఆర్కేబీచ్ నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు అధికారులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చిలో నిర్వహించే జి–20 సదస్సుకు అధిక సంఖ్యలో విదేశాల నుండి అతిథులు విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా, విశాఖ సాగర తీర ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ దీపాలు, సెంటర్ డివైడర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, కొబ్బరి, సరుగుడు చెట్లను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయడం, గోడలకు నూతనంగా ఆకర్షణీయమైన బొమ్మలతో రంగులు వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. తీర ప్రాంతం వెంబడి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని.. వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశాఖ కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు ఉన్న సాగర తీరం విశాఖ నగరానికి మణిహారమన్నారు. తీర ప్రాంతాన్ని అతిథులు అబ్బురపడేలా సుందరీకరించాలన్నారు. సెంటర్ డివైడర్లలో ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చేసి అందమైన ఆకృతులతో తీర్చిదిద్దాలని కమిషనర్ అధికారులకు సూచించారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్‌ఎల్‌జీ శాస్త్రి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి సురేష్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా..


ఎమ్మెల్యే వాసుపల్లితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు చెబుతున్న రంధి గోపి తదితరులు


ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న మత్స్యకార నాయకులు

అల్లిపురం: కోరిన వారికి లేదనకుండా సాయం అందజేయటంలో తనకు తానే సాటి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిరూపించుకున్నారు. నియోజకవర్గంలో మంగళవారం పలు ప్రాంతాల్లో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సొంత నిధులు రూ.11 వేలు అందజేశారు. 39వ వార్డు చిలకపేటకు చెందిన కాశారపు పరదేశికి రూ.5 వేలు, 33వ వార్డుకు చెందిన ఆకుల స్వర్ణకు రూ.3 వేలు, హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఒక మీడియా ప్రతినిధికి రూ.3 వేలు అందజేసి ఉదారత చాటుకున్నారు. అలాగే 39వ వార్డు లక్ష్మీటాకీస్ బస్టాపులో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మీ దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, వైఎస్సార్‌సీపీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు ప్రెసిడెంట్ అలపున కనకరెడ్డి, 33వ వార్డు ప్రెసిడెంట్ రంధి గోపి, దక్షిణ నియోజకవర్గం మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్యకర్తలు బ్రహ్మాజీ, వడ్డాది దిలీప్, భానుమూర్తి, దూడ తాతారావు, రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు .. ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపి ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలు ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, కొల్లి సత్యవతి, లక్ష్మీకాంతం, కళ, మహేష్, మచ్చ నూకరాజు, సీలాపు అయ్యప్పరెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీటాకీస్ ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

పారితోషికం మంజూరు చేయాలి

మహారాణిపేట : వినాయక చవితి, విజయ దశమి సందర్భంగా బీచ్ ప్రాంతంలో స్విమ్మర్లుగా విధులు నిర్వహించిన 764 మందికి రావలసిన పారితోషికాన్ని వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొంత మంది మత్స్యకారులు తమకు రావలసిన పారితోషికం వెంటనే ఇప్పించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి స్విమ్మర్లకు రావలసిన 43 లక్షల 77 వేల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. అలాగే 2019 జూన్ నుంచి నవంబర్ 2019 వరకు ఆయిల్ సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. మత్స్యకార సంఘాల నాయకులు బర్రి కొండబాబు, వీరన్న, ఉమ్మడి సుధాకర్, మున్నం బాలాజీ, రాము, కింగ్ ఫిషర్ రాజు, ఎండాడ సురేష్, సాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొగ్గు శ్యామ్, నీలకంఠం, లండా రమణ, సుబ్రహ్మణ్యం, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ


అవహగాన ర్యాలీలో పాల్గొన్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి తదితరులు

కంచరపాలెం: కంచరపాలెం కూడలిలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కావడంతో పాదచారులు ఇబ్బంది పడడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు కూడా ఫుట్‌పాత్ ఆక్రమణలు కారణమవుతున్నాయని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, వాహనాలు నిలిపినా, వ్యాపారాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, టీపీవో ఎం.శ్రీలక్ష్మి, గుమ్మిడి శ్రీను, జీవీఎంసీ, సచివాలయ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవునికి తులసీ దళార్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం తులసీ దళార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బందారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి ఉదయం నిర్వహించే ప్రత్యేక పూజలు అనంతరం 9 గంటలకు తులసీ దళార్చన, తరువాత సామూహిక విష్ణుసహస్ర నామార్చన ఉంటుందని పేర్కొన్నారు.

టన్నెల్ అక్వేరియంను సందర్శించిన వీసీలు


ఫిష్ అక్వేరియంను తిలకిస్తున్న వీసీలు, ఏఐయూ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఏయూ సౌజన్యంతో నిర్వహిస్తున్న సదస్సుకు హాజరైన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉపకులపతులు(వీసీలు) మంగళవారం రాత్రి ఏయూ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ అక్వేరియంను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్, ఉపాధ్యక్షుడు జి.డి.శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ పర్యాటకంగా విశాఖ నగరం అద్భుతంగా ఉందన్నారు. బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ మ్యూజియం, యుద్ధ విమాన మ్యూజియంతో పాటు పలు సందర్శనీయ స్థలాలను వీక్షించారు. టన్నెల్ ఫిష్ అక్వేరియం పర్యాటకులకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని కొనియాడారు. విశాఖ సందర్శకులకు స్వర్గధామంగా మారుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

హెల్మెట్ ధారణపై అవగాహన


కంచరపాలెం మెట్టు వద్ద అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు

మర్రిపాలెం: గతేడాది హెల్మెట్ ధరించకుండా రోడ్డు ప్రమాదాలకు గురై 147 మంది ద్విచక్ర వాహనచోదకులు మృతి చెందారని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాటిచెట్లపాలెం, కంచరపాలెంమెట్టు, ఊర్వశి జంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్ అండ్ బీ, మర్రిపాలెం, కరాస ఎన్ఏడీ కూడలి, కాకానినగర్ తదితర కూడళ్లలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సీసీ ఫుటేజీల్లో ఉన్న ప్రమాద దృశ్యాలను చూపించి వాహనచోదకులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐలు ఉల్‌హక్, వాసుదేవరావు, పాపారావు, హెచ్‌సీలు సుబ్బారావు, కానిస్టేబుల్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'సమష్టి కృషితో బీసీ సంఘం బలోపేతం'

సీతంపేట: ఉత్తరాంధ్రలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారని, అందరి సమష్టి కృషితో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం బలోపేతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఉత్తరాంధ్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కోర్ కమిటీ తీర్మానం మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్నట్టు శ్రీనివాస్ ప్రకటించారు. తన గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొణతాల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. విశ్రాంత జడ్జి బొడ్డేపల్లి రామారావు, సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సనపల అన్నాజీరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కె.రామకృష్ణంనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి.అప్పలనాయుడు, మన్యం జిల్లా నుంచి రాఘవరావు, రమణ , విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


గరుడసేవ నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈసేవ నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈసేవ నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు


రాజుగౌడ్

డాబాగార్డెన్స్ : విశాఖపట్నం మా రాజధాని అని ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర జిల్లాల అత్యంత వెనుకబడిన కులాల సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు రాజు యాత పేర్కొన్నారు. విశాఖ నుంచే పరిపాలన చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం విశాఖ వాసులు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజానీకం పండగ జరుపుకునే రోజు అని మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల ఉత్తరాంధ్ర నాయకుల సమావేశంలో రాజుగౌడ్ తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు జీవితాంతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని, అత్యంత వెనుకబడిన ప్రాంతం అయిన ఉత్తరాంధ్రలో విశాఖ ప్రాంతాన్ని పరిపాలన రాజధానిగా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటుకు గురైందని, విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు యావత్ ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా దేశంలోనే నంబర్‌వన్ రాజధానిగా అతి త్వరలోనే తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రాజధానులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విరాజిల్లుతుందని, అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

'పూర్ణామార్కెట్‌ను ప్రైవేటీకరించొద్దు'


మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహ్మద్ సాధిక్, నారాయణరావు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో అతి పెద్ద కూరగాయల మార్కెట్ పూర్ణామార్కెట్‌ను ప్రైవేటీకరించొద్దని కార్పొరేటర్లు మహ్మద్ సాధిక్, ఉరికిటి నారాయణరావు మంగళవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ పూర్ణామార్కెట్ ప్రైవేటీకరణ వల్ల నిత్యావసర కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే అజెండా నుంచి తొలగించాలని సాధిక్ డిమాండ్ చేశారు.

పందులు కనిపిస్తే కాల్చివేత


పందులను పట్టుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: పందులు కనిపిస్తే కాల్చివేత తప్పదని జీవీఎంసీ జోన్–4 అడిషన్ మెడికల్ అధికారి ఎస్.కిశోర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నగరంలో పందుల సంచారం ఎక్కువైందన్నారు. ఈ విషయమై పెంపకందారులతో పలుసార్లు చర్చించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పందులు తిరగరాదని హెచ్చరించామన్నారు. అయినప్పటికీ అవి రహదారులపైనే సంచరిండంతో కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్, ఆర్మ్‌డ్ పోలీసు ప్రొటెక్షన్ సిబ్బంది జీవీఎంసీ జోన్–4, 5, 8 పరిధి పెందుర్తి, జ్ఞానాపురం, గాజువాక, ఫెర్రిరోడ్డు తదితర ప్రాంతాల్లో 450 పందులను పట్టుకున్నారని తెలిపారు. మరో 250 పందులను కాల్చేశారన్నారు. జి–20 సదస్సు, వ్యాధుల సంక్రమించే ప్రమాదం ఉన్నందున పందులను నిర్మూలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పందుల పెంపకందారులు అవి బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కాల్చివేత తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యతో ట్రాఫిక్ ఇక్కట్లు


స్ప్రింగ్‌రోడ్డులో రహదారికి అడ్డంగా పెట్టిన వాహనాలు

జగదాంబ: రెండు పోలీస్ స్టేషన్ల మధ్య సమన్వయ లోపం కారణంగా వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలోని వన్ టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషన్ల సరిహద్దులో పూర్ణామార్కెట్‌లోని స్ప్రింగ్‌రోడ్డు ఉంది. ఇక్కడ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు నిత్యం విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ ప్రాంతంలోనే టూటౌన్ పోలీస్ స్టేషన్ కూడా ఉంది. అయితే ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం వలన ఈ రోడ్డులో అనధికారికంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీని వలన వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. స్ప్రింగ్ రోడ్డు నుంచి టూ టౌన్ డయాస్ ట్యాంక్ వరకు ఇదే విధంగా ఉన్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతే కాకుండా ఈ రోడ్డులో ఉదయం 10 గంటల తరువాత భారీ వాహనాలు లోపలికి రాకూడదన్న నిబంధన ఉన్నా అది అమలు కావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసుల గస్తీ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ల సరిహద్దు విషయంలో చర్యలు తీసుకోకపోతే ఇక్కడి సమస్య పరిష్కారం కాదని ప్రజలు, వ్యాపారులు అంటున్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

అల్లిపురం: స్కూలుకి వెళ్లిన ఇద్దరు మైనర్ బాలికలు తప్పిపోయిన ఘటనలో పోలీసులు చొరవ తీసుకుని వారిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో గల సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్లో 7,9 తరగతులకు చెందిన ఇద్దరు బాలికలు సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకోలేదని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. నగర డీసీపీ పర్యవేక్షణలో ఈస్ట్ ఏసీపీ, మహారాణిపేట సీఐ, ఎస్ఐలు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ద్వారా శోధించారు. ఈ మేరకు 20 మంది సిబ్బందితో ఐదు టీంలు ఏర్పాటు చేసి నగరంలో నైట్ రౌండ్ ఆఫీసర్ల పర్యవేక్షణలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బీచ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, డాల్ఫిన్ రూట్, జగదాంబ జంక్షన్ తదితర ప్రాంతాల్లో గాలించి సీసీ ఫుటేజీల ఆధారంగా బాలికలను గుర్తించారు. బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు సత్యసాయిబాబా వ్రతం

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని సత్యసాయిబాబా మందిరంలో పట్టాభిరెడ్డితోట భజన మండలి, మాధవధార సమితి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సత్యసాయిబాబా వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 4.45 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8 గంటలకు సత్యసాయి బాబా వ్రతం చేయనున్నారు. ఉదయం 12 గంటలకు ఆశ్రమం పిల్లలకు నారాయణసేవ, సాయంత్రం 5 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వేద పఠనం, నామ సంకీర్తన, 5.45 గంటలకు బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 6.30 గంటలకు జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సూర్యనారాయణ మాస్టారి ప్రసంగం, 7.30 గంటలకు అఖండ జ్యోతి మంగళహారతి, ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.